క్లుప్తంగా

అన్నదానం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద ప్రజలను ఆదుకోవడంలోనే అసలైన సంతృప్తి దాగిఉందని, ప్రతి ఒక్కరూ తమకు ఉన్న దాంట్లో లేనివారికి సాయం చేయాలని కళ్ళే లలితా ఛారిటబుల్ ట్రస్ట్ డైరక్టర్లు కళ్ళే సీతామహాలక్ష్మీ, జయదుర్గాలు అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద అన్నదాన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభాగ్యులకు, నిస్సహాయులకు సేవ చేయడం ఆ భగవంతుడికి సేవ చేయడంతో సమానమని, ప్రతి ఒక్కరూ సేవా దృక్పతాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా పేద ప్రజలకు అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. అనంతరం 1000 మందికి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ముప్పూరి హరీష్, ఎం.జశ్విన్, జి.ధృవన్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అంకమ్మతల్లి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమావాస్య పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేషంగా కుంకుమ పూజలు అభిషేకాలు, శ్రీ చక్రార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముత్యాలంపాడులో....

ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ కార్యదర్శి దాట్ల శివరామరాజు, ఐఎస్ఎన్ రాజు పర్యవేక్షించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన కాటుమాల జోసెఫ్, పవన్‌కుమార్ కుటుంబాలకు అండగా ఉంటామని ఏపీ ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు హామీ ఇచ్చారు. జోసెఫ్, పవన్‌కుమార్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదివారం కలిసి పరామర్శించారు. వారి మరణాలకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కొండాయగుంట బలరామ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ కోనా వీరబ్రహ్మం సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్లో వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు ఆయుర్వేదం, హోమియో చికిత్సల గురించి వివరించారు. ఆయుర్వేదం, హోమియోపతి వైద్యం ద్వారా ఎటువంటి దుష్పరిణామాలు లేకుండా అన్ని దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయవచ్చని తెలిపారు. అనంతరం 270 మందిని ఉచితంగా పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు.

జాతీయ స్కూల్ గేమ్స్ చెస్ పోటీలకు విజయకుమార్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఏలూరులో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో సింగ్‌నగర్ రామకృష్ణ చెస్ అకాడమీకి చెందిన ఎ.విజయ్‌కుమార్ 5వ స్థానం సాధించి, జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఆరు రౌండ్లు జరిగిన ఈ పోటీల్లో ఐదు పాయింట్లు సాధించిన విజయ్‌కుమార్ మన జిల్లా నుంచి ఎంపిక కావడం చాలా గర్వంగా ఉందని కోచ్ అవ్వారు రామకృష్ణ తెలిపారు. విజయ్‌కుమార్ ఇలానే మరిన్ని విజయాలు సాధించి నగరానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విజయ్‌కుమార్‌ను సన్మానించి, అభినందనలు తెలిపారు.

నగరంలో దీపావళి సందడి



దీపావళి వెలుగుల్లో ఉత్సాహంగా యువతులు



టపాసులు కాల్చుతున్న యువతులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని ప్రధాన రహదారులు ఆదివారం సందడిగా దర్శనమిచ్చాయి. ప్రతి ఇంటా దీపపు కాంతులు దేదీప్యమానంగా దర్శనమిచ్చాయి. బాణసంచా మోతతో వన్‌టౌన్ దద్దరిల్లింది. ఉదయం దీపాలను వెలిగించే ప్రమిదాల అమ్మకాలు ఆయా కూడళ్లలో జోరుగా సాగాయి. మెయిన్‌బజార్, సామారంగంచౌక్, ఐరన్‌మార్కెట్, శివాలయంవీధి, కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్లలో వివిధ ఆకృతుల్లో తయారు చేసిన మట్టి ప్రమిదలు, బొమ్మలను వ్యాపారులు విక్రయించారు. కొందరు ఆకర్షణీయమైన మైనపు దీపాలను కొనుగోలు చేస్తూ కనిపించారు. సాయంత్రం ఐదు గంటల నుంచి బాణాసంచా కాలుస్తూ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ప్రముఖ మిఠాయి దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. గిఫ్ట్ ప్యాకింగ్స్ కూడా ఆకర్షిణీయంగా రూపొందించి విక్రయించారు. అలాగే డ్రైఫ్రూట్స్, చాక్‌లెట్స్ విక్రయాలు జోరుగా సాగాయి. వన్‌టౌన్‌లో వ్యాపారలావాదేవీలు నిర్వహించే ఉత్తర భారతీయులు దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని లక్ష్మీపూజలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దుకాణాలు రమణీయంగా అలంకరించారు. పలు దుకాణ సముదాయాలకు విద్యుద్దీపాలను అలంకరించడంతో చూడముచ్చటగా దర్శనమిచ్చాయి.

పాతబస్తీలో విస్తృతంగా అమ్మకాలు....

దీపావళి సందర్భంగా ఏటా వన్‌టౌన్‌లోని మెయిన్ బజార్ తదితర ప్రాంతాల్లో వందలాది మంది హాకర్లు బాణ సంచాను విక్రయిస్తుంటారు. అయితే గతంలో వారిని నిలువరించి వారందరినీ గాంధీజీ హైస్కూల్ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లతో అనుమతించారు. అయితే గత ఏడాది జింఖానా గ్రౌండ్స్‌లో ప్రమాదాన్ని గమనంలో ఉంచుకొని నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలోకి వ్యాపారులను అనుమతించారు. కెనాల్‌రోడ్డులోని కాల్వ పక్కన ఉన్న రహదారిపైఅనుమతించారు. సుమారు నాలుగైదు వందల మంది హాకర్లు అమ్మకాలు సాగించగా వేలాదిగా వినియోగదారులు తరలివచ్చి సరుకులను కొనుగోలు చేశారు.

భారతీయ సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారతీయ సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని కేబీఎస్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. ఆ కళాశాల హాస్టల్ ప్రాంగణంలో దీపావళి సంబరాలను ఆదివారం సందడిగా నిర్వహించారు. కళాశాలలోని హాస్టల్ విద్యార్థులందరూ ఉదయం నుంచి రాత్రి వరకూ వివిధ కార్యక్రమాలతో సందడి చేశారు. ఉదయం డాన్స్ పోటీలు, అంత్యాక్షరి, తంబోల, మ్యూజికల్ చైర్ వంటి వివిధ అంశాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం కళాశాల ప్రాంగణంలో దీపాలను ఏర్పాటు చేసి టపాసులను పేల్చి సందడి చేశారు. వేడుకలను ప్రారంభించిన తూనికుంట్ల శ్రీనివాసు వివిధ అంశాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చిన్నా, పెద్దా.. పేద, ధనిక తేడా లేకుండా దీపావళి వేడుకలను నగర వాసులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మధురానగర్, ముత్యాలంపాడు, రామకృష్ణాపురం, దేవీనగర్, దావు బుచ్చయ్యకాలనీ, అయోధ్యనగర్, మాచవరం, దుర్గాపురం తదితర ప్రాంతాల్లో దీపావళి వేడకలు ఘనంగా జరిగాయి. ఎవరికి వారు తమ శక్తిమేరకు మందుగుండు సామాగ్రిని కొనుగోలు చేసి పండుగ చేసుకున్నారు. దీపావళి సందర్భంగా ఇళ్ళను అందంగా దీపాలతో అలంకరించారు. తొలుత లక్ష్మీ పూజలు చేసి అనంతరం బాణాసంచా కాల్చారు. వీధులన్నీ బాణాసంచా మోతలతో దద్దరిల్లాయి.

నేటి నుంచి కార్తిక మాసోత్సవాలు ప్రారంభం



ముత్యాలంపాడులో స్వామివారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్తిక మాసోత్సవాలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న కార్తిక మాసోత్సవాలకు దేవాలయాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించి మామిడి తోరణాలు కట్టి పూజలకు సిద్ధం చేశారు. అయోధ్యనగర్‌లోని శ్రీదత్తసాయి శివ కామేశ్వరీ పీఠం, ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయం, మధురానగర్‌లోని శ్రీ ఉభయ రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో కార్తిక మాసోత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఏర్పాట్లు పూర్తయ్యాయి. కార్తిక మాసంలో 365 వత్తులతో దీపాలను వెలిగిస్తే సంవత్సరమంతా దీపారాధన చేసిన ఫలితం కల్గుతుందని పురాణాలు తెలుపుతున్నాయి. శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తిక మాసంలో భక్తులు దీపారాధన, పూజలు చేసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

నేటి నుంచి ఎంఎస్ మూర్తి శత జయంతి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): లలిత కళల అభివృద్ధికి విశేషంగా కృషిచేసిన ఎంఎస్ మూర్తి శత జయంతి ఉత్సవాలు మంగళవారం ది ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యాన ముత్యాలంపాడు ఎంఎస్ మూర్తి లలిత కళ ఆర్ట్ గ్యాలరీలో ఘనంగా నిర్వహించనున్నట్లు అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఆనంద్‌స్వరూప్, ఎంవీ సాయిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. లలిత కళల అభివృద్ధికి గానూ తాము ఎంఎస్ మూర్తి శతజయంతిలో భాగంగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు రామాయణ సుధానిధి, భాషా ప్రవీణ డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు చేతుల మీదుగా ఎంవీ సాయిబాబు రచించిన అక్షర రేఖాచిత్ర శిల్పి పుస్తకంను ఆవిష్కరిస్తారన్నారు. సాయంత్రం 6.30 గంటలకు ఎంఎస్ మూర్తి లలిత కళ ఆర్ట్ గ్యాలరీలో ప్రపంచమొక పటం-చిత్రకారుడు భగవంతుడు అనే అంశంపై శ్రీనివాసరావు ప్రవచనం చేస్తారని చెప్పారు. శత జయంతి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని లలిత కళల అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.

సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం

- నగరాల సంఘం ప్రతినిధులు
- ఎమ్మెల్యే వెలంపల్లికి సన్మానం



పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును సన్మానిస్తున్న నగరాల కుల సంఘం ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా నగరాల కులాన్ని బీసీలుగా పరిగణిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తాము జీవితాంతం రుణపడి ఉంటామని నగరాల సంఘం ప్రతినిధులు తెలిపారు. నగరాల కులాన్ని బీసీ-డీ గా పరిగణిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇందు కోసం అలుపెరగకుండా కృషి చేసిన పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమవారం భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును నగరాలు కుల సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాలో ఉన్న నగరాలను బీసీ-డి లుగా పరిగణించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసి తమకు ఎంతో మేలు చేసిందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ కల నెరవేరిందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ముఖ్యంగా విజయవాడ నగరంలో ఉన్న నగరాల కులాన్ని బీసీ-డీలుగా పరిగణించాలని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చేసిన కృషి మరువలేనిదన్నారు. తమ కోసం వెలంపల్లి అహర్నిశలు శ్రమించారన్నారు. ఈ కార్యక్రమంలో నగరాల సంఘం ప్రతినిధులు ఎన్వీ రావు, పిళ్ళా రవి, శీరం వెంకట్రావు, మజ్జి శ్రీనివాసరావు, బాయన శేఖర్ బాబు, రాంపిళ్ల వాసు, నాగోతి శ్రీనివాసరావు, కొరగంజి చక్రవర్తి, ఇద్దిపిల్లి పవన్, పొట్నూరి శివ నాగేశ్వరరావు, అడ్డూరి రాము, నాగోతి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి వివాదం నేపథ్యంలో దాడి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆస్తి వివాదాల నేపథ్యంలో బాబాయిపై దాడి చేసిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాణావతి నాగేశ్వరరావు గుణదల పవర్ ఆఫీస్ కట్టపై నివాసం ఉంటున్నాడు. ఆయనకు అన్న కొడుకు ధర్మయ్యతో రేపూడి తండా దగ్గర పొలం తగాదాలు ఉన్నాయి. పలుమార్లు ఈ విషయమై ఘర్షణలు సైతం జరిగాయి. అలాగే ఏడాది క్రితం ధర్మయ్యకు నాగేశ్వరరావు రూ. నాలుగు లక్షలు అప్పుగా ఇచ్చారు. ఈ డబ్బులు తిరిగి చెల్లించే విషయంలో ఇద్దరికీ గొడవలు జరిగాయి. దీంతో ధర్మయ్య ఈనెల 11వ తేదీ శనివారం సాయంత్రం ఐదు గంటలకు నాగేశ్వరరావుతో మాట్లాడటానికి వచ్చారు. డబ్బుల విషయమై మాట్లాడుకుంటుండగా ఇద్దరి మధ్య తీవ్రవాగ్వాదం జరిగింది. ఆగ్రహానికి గురయ్యిన ధర్మయ్య శనివారం రాత్రి ఒంటి గంట సమయంలో నాగేశ్వరరావుపై కత్తితో దాడి చేశాడు. దాడిలో నాగేశ్వరరావుతో పాటు స్నేహితుడైన శ్రీహరి గాయపడ్డారు. గాయపడిన నాగేశ్వరరావు, శ్రీహరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు ధర్మయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

19 న బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన

విజయవాడ కల్చరల్: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో 19 వ తేదీ కార్తీక వనసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి దశరథ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సేవా సంఘం ద్వారా బ్రాహ్మణ ఐక్యత సాధించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నున్న సమీపంలో శ్రీ చంద్రశేఖర స్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం, రుద్రహోమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 99660 96999 నంబరులో సంప్రదించాలని కోరారు.

తెలుగువారి కీర్తి పతాక గాయని సుశీల



సినీ గీతాలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడ కల్చరల్: తెలుగు వారి కీర్తి పతాక గాయని పి.సుశీల అని స్వరలయ సాంస్కృతిక సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్.ప్రభాకర్ అన్నారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బహుభాషా గాయని పి.సుశీల 89వ జన్మదిన వేడుకలు, పాడనా తెలుగు పాట పేరుతో సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ స్వయం కృషితో గాయని సుశీల ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నారని గుర్తు చేశారు. న్యాయవాది మోహన్ రాంప్రసాద్ సుశీల జీవిత విశేషాలను వివరించారు. గాయనీ గాయకులు శాంతిశ్రీ, పావని, నాగమణి, బ్రహ్మానందం, అనిల్, డి.కృష్ణలు సుశీల గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో స్వరలయ అధ్యక్షుడు వై సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు సెక్షన్ భగత్‌సింగ్ రోడ్డు ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు, జెండాచెట్టు ఏరియా, భగత్‌సింగ్ రోడ్డు, కృష్ణ అపార్ట్‌మెంట్ రోడ్డు, గంగానమ్మగుడి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన అన్నారు.

విద్యారంగంలో సంస్కరణల ఘనత జగనన్నదే

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యారంగంలో మునుపెన్నడూ లేని విధంగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీరామ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆధ్వర్యంలో సోమవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటుగా తమకు ఆసక్తి ఉన్న రంగాల్లోనూ రాణించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేసి అమలు చేస్తున్న అమ్మ ఒడి, విద్యాకానుక వంటి వివిధ సంక్షేమ పథకాలతో తాము పెట్టుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ప్రతి విద్యార్థి తమ జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, దానిని సాధించేందుకు పట్టుదల, క్రమశిక్షణ, చిత్తశుద్ధి అవసరమని పేర్కొన్నారు. శ్రీరామ్ హైస్కూల్ అధినేత బోని సురేష్ కుమార్ మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా ప్రతి ఏటా చిల్డ్రన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడ, సాంస్కృతిక రంగాలలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శైలజ రెడ్డి, సీపీఎం నేత సీహెచ్ బాబూరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

బాపట్ల ఎంపీ నందిగం సురేష్



అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ నందిగం సురేష్, దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. రాణిగారితోట, 18వ డివిజన్‌లో సిమెంట్ గోడౌన్స్ వెనుక వైపు మహాజగృతి ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌తో కలిసి సోమవారం ఆయన ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ సురేష్ మాట్లాడుతూ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌లు ఒక కులానికి, ఒక మతానికి చెందిన వారు కాదన్నారు. యావత్ భారత జాతి కోసం అహర్నిశలు కృషి చేసి తమ జీవితాలను సైతం త్యాగం చేశారన్నారు. దళితుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. నగరం నడిబొడ్డున అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అణగారిన వర్గాలకు చంద్రబాబు ఇంగ్లీషు విద్యను దూరం చేశారని విమర్శించారు. రెండెకరాల భూమి ఉన్న చంద్రబాబు వందల కోట్ల రూపాయలు ఎలా సంపాదించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మహనీయుల స్ఫూర్తిని మహాజాగృతి ఐక్యవేదిక సభ్యులు ముందుకు కొనసాగించాలని కోరారు. అవినాష్ మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పెద్ద పీట వేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీలను చంద్రబాబు మోసం చేశారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, 17, 22 డివిజన్ల కార్పొరేటర్లు తంగిరాల రామిరెడ్డి, తాటిపర్తి కొండారెడ్డి, ఐక్యవేదిక కమిటి అధ్యక్ష కార్యదర్శులు పల్లేటి ఆనంద్ విరాట్, చౌటపల్లి ప్రకాష్, లాజర్, కె.సురేష్, సునీల్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బాబా మందిరంలో దీపావళి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీగా విరాజిల్లుతున్న ముత్యాలంపాడు శ్రీ షిర్డీ సాయి బాబా మందిరంలో దీపావళి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని దీపోత్సవంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకొనే దీపావళితో ప్రతీ ఇంటా నూతన కాంతులు ప్రసరించాలని ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పండుగలతో బంధాలు పటిష్టం అవుతాయని అందరూ కలిసిమెలసి జరుపుకోవాలన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో బాబాను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం దీపోత్సవంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


మసీదు నిర్మాణానికి రూ.50 వేలు వితరణ



మసీదు పెద్దలకు చెక్కు అందజేస్తున్న పడమట స్నిగ్ధ

పెనమలూరు: రాష్ట్రంలోని ప్రతి ఒక్క సామాజిక వర్గానికి పెద్దన్నగా జగనన్న నిలుస్తున్నారని, ఆయా వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నారని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. కానూరు సనత్ నగర్-సిద్దిక్ నగర్ ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న మక్కా మసీదు నిర్మాణ పనులకు రక్ష ఫౌండేషన్ తరఫున రూ.50 వేలు చెక్కు సోమవారం అందించారు. ఈ సందర్భంగా మసీదు పెద్దలు పడమట స్నిగ్ధను ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి వైఎస్సార్ ఆశయాలను పుణికిపుచ్చుకుని పాలన సాగిస్తున్నారన్నారు. ముస్లిం సంక్షేమానికి ఎక్కడా లోటు రాకుండా విధానాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రాధాన్యతా క్రమంలో సంక్షేమ ఫలాలను ఆయా వర్గాలకు చేరువ చేస్తూ సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దేశం యావత్తూ సీఎం జగన్ వైపు చూస్తోందని తెలిపారు. ప్రతిపక్షాలు ఓర్వలేక, ప్రభుత్వంపై బురదచల్లుతున్నాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ఎంపీటీసీ అహ్మద్, రాష్ట్ర మైనారిటీ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు మధుమేహ నియంత్రణపై అవగాహన సదస్సు



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ కె.వేణుగోపాలరెడ్డి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని వీజీఆర్ డయాబెటీస్ ఎడ్యుకేషనల్ అండ్ అవేర్‌నెస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మధుమేహ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మధుమేహ నిపుణులు డాక్టర్ కె.వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించే ఈ సదస్సులో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జయసూర్య, సినీనటుడు పద్మ భూషణ్ అవార్డు గ్రహీత కన్నెగంటి బ్రహ్మానందం పాల్గొంటారని చెప్పారు. మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల్లోని 500 పాఠశాలల్లో విద్యార్థులకు డయాబెటీస్‌పై అవగాహన కలిగించేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయా పోటీల్లో 55 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. వారిలో విజేతలకు అతిథుల చేతుల మీదగా బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు. మధుమేహంపై అవగాహన భవిష్యత్తుకు భద్రత కలిగిస్తుందన్నారు. ఇప్పటి వరకూ వీజీఆర్ డయాబెటీస్ అట్లాస్‌ను తెలుగు, ఇంగ్లీషు బాషల్లో ఆవిష్కరించామని, మంగళవారం హిందీలో ముద్రించిన పుస్తకాన్ని అతిథుల చేతుల మీదగా ఆవిష్కరిస్తామన్నారు.

వెలుగు జిలుగుల దీపావళి





విజయవాడ నగరంలో దీపావళి పర్వదినాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో పండుగ సందడి నెలకొంది. రంగు రంగుల విద్యుద్దీపాలతో గృహాలు, వాణిజ్య సముదాయాలను అలంకరించారు. బాణసంచా పెద్ద మొత్తంలో కాల్చారు. అనేక రకాలు టపాసులను నగరవాసులు పేల్చారు. కోలాహలంగా దీపావళి మందులు కాల్చి ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ